బెస్ట్.. మిల్లెట్ బ్రేక్‌ఫాస్ట్

- చిరుధాన్యాలతో చేస్తున్న టిఫిన్లకు ఎక్కువ డిమాండ్
- గోదావరిఖని పట్టణంలో వెలసిన హోటళ్లు
- మిల్లెట్ స్ట్రీట్ ఫుడ్‌గా మారిన మార్కండేయకాలనీ
- ఆరోగ్యాన్నిచ్చే ఆహారంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి



కోల్‌సిటీ: 'రాగి, జొన్న, సజ్జ, కొర్రలతో చేసిన ఇడ్లీలు.. మిల్లెట్ దోశ, రాగి అట్లు, రాగి పూరీ, జొన్న అంబలి, రాగి జావా, రాగి సంకటి, మొలకలతో చేసిన కర్రీ..' ఇదేం బ్రేక్‌ఫాస్ట్ ఫుడ్ అనుకుంటున్నారా? ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాల్సిందే అంటున్నారు ఆరోగ్య ప్రియులు. మన పూర్వీకులు బలమైన ఆహారం తీసుకోవడంతో ఎలాంటి వ్యాధులు లేకుండా జీవించారని చెప్తుంటారు. ప్రజలు మళ్లీ సంప్రదాయ ఆహారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి వారి అభిరుచికి అనుగుణంగా గోదావరిఖని పట్టణంలో చిరుధాన్యాల టిఫిన్ సెంటర్లు వెలుస్తున్నాయి. మిల్లెట్ కొత్త రుచులకు కేరాఫ్ చిరునామాగా మారిన మార్కండేయకాలనీ.. మిల్లెట్ స్ట్రీట్ ఫుడ్‌గా మారింది. టేస్ట్ బాగుండడంతో మిల్లెట్ బ్రేక్‌ఫాస్ట్ కోసం పట్టణవాసులు మిల్లెట్ ఫుడ్ సెంటర్లలో బారులుదీరుతున్నారు.

ఇవే చిరుధాన్యాలు..

పూర్వకాలంలో మెట్ట పంటలైన చిరు ధాన్యాలను ఎక్కువగా సాగు చేసేవారు. వీటినే ప్రధాన ఆహారపు అలవాటుగా చేసుకున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి జొన్నలు, సజ్జలు, కొర్రలు, వరిగలు, రాగులు, అరికలు, అండు కొర్రలు, ఊదలు, అవిసెలు, సామలు తదితర మొదలైనవి ఉన్నాయి.

చిరుధాన్యాల టిఫిన్లు..

చిరుధాన్యాలు ఉపయోగించి పలు రకాల టిఫిన్లు తయారు చేస్తున్నారు. గోదావరిఖని మార్కండేయకాలనీలో వెలిసిన మిల్లెట్ హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. చిరుధాన్యాలతో దోశలు, ఇడ్లీలు, రాగి సంకటి, రాగి పూరీలు, రాగి జావ లాంటివి ప్రత్యేకంగా చేస్తున్నారు. కొందరు నువ్వుల లడ్డు, అవిస గింజల లడ్డు, బీట్‌రూట్ లడ్డూలే తయారు చేసి అమ్ముతున్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక సమస్యలున్న వారితోపాటు ఇతర వ్యాధులు ఉన్నవాళ్లు రోజూ అల్పాహారంగా మిల్లెట్ ఫుడ్ తీసుకుంటున్నారు.

రోజూ మిల్లెట్ బ్రేక్‌ఫాస్టే..



మా ఇంట్లో అందరం రోజూ చిరుధాన్యాలతో తయారు చేసిన టిఫిన్లు తింటాం. ఇవి తిన్నప్పటి నుంచి ఆరోగ్యం మంచిగా ఉంది. ఇంట్లో తయారు చేయని రోజు మిల్లెట్ హోటల్‌కు వెళ్లి తింటాను. చాలా టేస్టీగా ఉంటుంది. ధర కూడా చలా తక్కువ. షుగర్, బీపీ తదితర వ్యాధులున్న వాళ్లు వీటిని తింటే బెటర్. చాలా మంది తగ్గినట్లు చెప్తున్నారు.

– పోచంపల్లి తిరుపతి, సివిల్ కాంట్రాక్టర్–గోదావరిఖని

ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నా



చిరు ధాన్యాలతో టిఫిన్ చేయడానికి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న. గోదావరిఖనిలో మిల్లెట్ ఆహారం అందించాలనే ఉద్దేశంతో దుర్గాభవాని హోం మిల్లెట్ పేరుతో టిఫిన్ సెంటర్ పెట్టాను. షుగర్, బీపీ, గుండె జబ్బులు, క్యాన్సర్ పేషంట్లు టిఫిన్ సెంటర్‌కు బాగా వస్తున్నారు. చాలా మంది పార్సిళ్లు కూడా తీసుకెళ్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా మిల్లెట్స్ టిఫిన్ పంపిణీ చేయాలని చూస్తున్న.

– ముక్కెర శ్రావణ్, నిర్వాహకుడు

చిరుధాన్యాలే శ్రేయస్కరం..



రాష్ట్ర వాతావరణానికి చిరు ధాన్యాల ఆహారమే శ్రేయస్కరం. సంప్రదాయ ఆహార పదార్థాలను తినడం ఆరోగ్యానికి మంచిది. రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలవంటి చిరు ధాన్యాలతో సంప్రదాయ ఇడ్లీ, దోశలను అందించడానికి హోటళ్లు అందుబాటులోకి శుభపరిణామం. మిల్లెట్స్ ఫుడ్‌లో చాలా మంచి పోషకాలుంటాయి. ఇలాంటి తరహా హోటళ్లు మరిన్ని ఏర్పాటు కావాలి.

– డాక్టర్ అశోక్, హెచ్ఓడీ–జనరల్ మెడిసిన్, గోదావరిఖని

ఉపాధి కల్పిస్తున్న



నాన్న చనిపోవడంతో బీఎస్సీని మధ్యలోనే ఆపేసి, నాలుగేళ్లు హోటళ్లలో పనిచేసిన. మిల్లెట్లతో అల్పాహారం తయారు చేయడానికి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందాను. గోదావరిఖనిలో మిల్లెట్ హోటల్ పెట్టడానికి కరీంనగర్ నుంచి వచ్చాను. నాతోపాటు మరో ఏడుగురికి ఉపాధి కల్పిస్తున్న. షుగర్, బీపీ సమస్యలున్న వారు మిల్లెట్‌తో చేసిన బ్రేక్‌ఫాస్ట్‌ను తినడానికి వస్తున్నారు. ఎక్కువగా పార్సిల్స్ తీసుకుపోతున్నారు.

– శ్రావణ్‌కుమార్, నిర్వాహకుడు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి పాఠశాల విద్యార్థి మనస్వినిరావు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థిని శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు. 15న పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో గెలుపొందగా 20 నుంచి ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వెల్‌నెస్ న్యూట్రిషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెల్‌నెస్ కోచ్ రజిత

పెద్దపల్లిరూరల్: జీవన విధానంలో వ్యక్తిగత శుభ్రతతో పాటు ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలని వెల్‌నెస్ కోచ్ దుర్శెట్టి రజిత అన్నారు. పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం విద్యార్థులకు వెల్‌నెస్ న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆహారపు అలవాట్లపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, స్త్రీలలో వచ్చే సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

రామగిరి: కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఆకుల వెంకన్న కోరారు. శనివారం కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని, నేటికీ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనకలక్ష్మి, ఓదమ్మ, రాజ్యలక్ష్మి, సరోజన, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్లాంకెట్లు అందజేత



ఆశ్రమానికి బ్లాంకెట్లు అందిస్తున్న కానిస్టేబుల్

గోదావరిఖనిటౌన్: నగరంలోని విఠల్‌నగర్‌లోని అమ్మ పరివార్ పిల్లల అనాథ ఆశ్రమానికి ముత్తారంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బొజ్జ సురేందర్ అనాథ పిల్లలకు బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు, పిల్లలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అన్నం వడ్డిస్తున్న నరసింహారెడ్డి

గోదావరిఖనిటౌన్: నగరంలోని శ్రీకోదండ రామాలయంలోని అయ్యప్ప ఆలయంలో స్థానిక ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయులు నరసింహారెడ్డి, సుధారాణి దంపతులు అయ్యప్ప ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమార్తె స్వాతి జన్మదినం సందర్భంగా అయ్యప్ప మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవులపల్లి రాజేందర్, నయీం పాషా, అల్లావుద్దీన్, సదానందం, మహేశ్‌బాబు, ధర్మపురి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



అభినందిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆకాంక్షించారు. పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ కళాశాలకు చెందిన ఎంకామ్ విద్యార్థి పిడుగు శ్రీకాంత్ నేషనల్ లెవల్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. కాగా శనివారం అదనపు కలెక్టర్ శ్రీకాంత్‌ను అభినందించారు. బాక్సింగ్ వెయిట్ కేటగిరి(75–81)కేజీ విభాగంలో సెలెక్ట్ అయ్యాడు. పంజాబ్‌లోని చండీగఢ్‌లో జనవరిలో జరిగే నేషనల్ లెవల్ బాక్సింగ్ పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున పాల్గొననున్నట్లు కళాశాల అధినేత అల్లంకి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లయ్య, ప్రిన్సిపాల్ రవీందర్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న కరస్పాండెంట్ అహ్మద్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన రాబియా ఫలక్ ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సయీద్ అహ్మద్ తెలిపారు. శనివారం విద్యార్థిని అభినందించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో జరిగిన చెస్ పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రతిభ కనబరిచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ ఉన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు



విజేతలతో ఎస్సై అశ్విని



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం రిజర్వాయర్ కట్టపైన శనివారం ఉదయం జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో అండర్ 16 వాళ్లకు 2 కి.మీ, అండర్ 18 వాళ్లకు 6 కి.మీ, అండర్ 20 వాళ్లకు 10 కి.మీ మహిళలకు, పురుషులకు పోటీలు జరిగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని అసోసియేషన్ కార్యదర్శి కొమ్ము గట్టయ్య తెలిపారు. అండర్–16 విభాగంలో మొదటి స్థానం కావ్య (కనగర్తి), రెండోస్థానం మనోజ్ఞ (ధర్మారం), మూడోస్థానం హర్షిణి (నందిమేడారం), అండర్–18లో మొదటి స్థానంలో శ్రావ్య (ధర్మారం), రెండోస్థానంలో అఖిల్ (నందిమేడారం), మూడోస్థానంలో సంజయ్ (సుల్తానాబాద్), అండర్–20 బాలుర విభాగంలో రాజ్‌కుమార్ (సుల్తానాబాద్), రెండోస్థానంలో అజయ్ (సుల్తానాబాద్), మూడో విభాగంలో ఉమేశ్ (నందిమేడారం), అండర్–20 బాలికల విభాగంలో మేఘన (ధర్మారం) మొదటి స్థానంలో నిలిచింది. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు గట్టయ్య పేర్కొన్నారు. విజయం సాధించిన క్రీడాకారులకు స్థానిక ఎస్సై అశ్విని షీల్డ్స్ అందించారు. సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు దేవి రమణ, పీఈటీలు కొమురయ్య, తమ్మడవేని కుమార్, సౌజన్య, మౌనిక, నర్మద పాల్గొన్నారు.

పీకే రామయ్యకాలనీలో మార్పు మొదలైంది



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ పీకే రామయ్య కాలనీలో పదేళ్లుగా లేని మార్పు ప్రారంభమైందని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ విజయం సాధించడం, డివిజన్‌ను దత్తత తీసుకుంటానన్న హామీతో మార్పు మొదలైందన్నారు. కాలనీలోని డ్రైనేజీ శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికగా శానిటేషన్ పనులు ప్రారంభకావడంపై డివిజన్ ప్రజలు, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మోహన్, సత్యాని, ధనంజయ్, రాంప్రసాద్, హేమంత్, ప్యారే, బోడో పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన



నర్సరీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు పెగడపల్లిలో శనివారం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వృత్తి విద్యా కోర్సులో భాగంగా పత్తి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు సాగుచేస్తున్న ఆయిల్ పాం తోటలను, అదే గ్రామంలో నర్సరీ ప్లాంట్‌ను సందర్శించారు. ఆయిల్‌పాం తోటలో అంతర పంటల సాగు, డ్రిప్ ఇరిగేషన్‌తో సాగు వివరాలు వ్యవసాయాధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్ర సందర్శనతో సాగు పద్ధతి, రైతుల కష్టాలు, వ్యవసాయంలో నైపుణ్యం తదితర విషయాలను పరిశీలించామని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సర్పంచ్‌లు

ఓదెల: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండలంలోని సర్పంచ్‌లు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పల్లె ఓదెలు, కల్లెపల్లి రవి, అంబాల సంధ్యారాణి శ్రీనివాస్, గుగులోతు వస్త్రం నాయక్ ఉన్నారు.

జాతీయ సమ్మేళనం విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోరాట వేదిక సభ్యులు

మంథని: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు గాంధీ ఆశ్రమంలో 19న నిర్వహించే జయహో రెండో జాతీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి మేకల మల్లేశం కోరారు. శనివారం మంథనిలోని మదర్ థెరిస్సా మహిళా భవనంలో సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయోద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేసేందుకు దేశంలోని మతోన్మాదులను నిర్మూలించేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమం నిర్మాణమవుతుందన్నారు. బీసీ మహిళా పోరాట వేదిక జిల్లా కార్యదర్శి మాదేసి పద్మ, నామని సుగుణ, తన్నీరు లక్ష్మణ్, సరిత, ముప్పిడి మల్లేశ్వరి, యాదమ్మ, దుర్గ ఓదెక్క తదితరులు ఉన్నారు.

విధులకు హాజరైన పోస్టల్ సిబ్బంది

జూలపల్లి: న్యాయమైన తమ డిమాండ్లు కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని చేపట్టిన సమ్మెను పోస్టల్ సిబ్బంది విరమించి విధులకు హాజరయ్యారు. నాలుగు రోజులుగా సమ్మెలో ఉన్న తమ డిమాండ్లకు సానుకూల వైఖరి రావడంతో ఎలిగేడు బ్రాంచ్ పరిధిలోని 12 పోస్టాఫీసుల సిబ్బంది సమ్మె విరమించి శనివారం విధులకు హాజరయ్యారు.

అల్ఫోర్స్ క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: విద్యార్థులను విద్యతోపాటు క్రీడా రంగంలో ప్రోత్సహిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు జి.రోహిత్, అభిషేక్, ఎస్.కె ఇనాస్ క్విన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ కేవలం చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వారికి నిష్ణాతులైన శిక్షకులతో నిత్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్‌లో శనివారం నుంచి జరుగుతున్న అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న అల్ఫోర్స్ క్రీడాకారులను అభినందించారు.

యాజమాన్య అనుకూల సంఘాలను ఓడించాలి



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని: సింగరేణి యాజమాన్య అనుకూల సంఘాలను ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏడోసారి సింగరేణిలో ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో జాతీయ సంఘాలు ప్రచార ఆర్భాటాలు చేస్తూ మోసపు మాటలతో కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. గతంలో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేని సంఘాలు ఈరోజు పోరాట ఫోజులు పెడుతూ కార్మికులను మరోసారి మోసం చేయడానికి వస్తున్నాయన్నారు. ప్రభుత్వ, యాజమాన్య అనుకూల సంఘాలను దరిదాపుల్లో లేకుండా చేయాలని కోరారు. నాయకులు విశ్వనాథ్, రాయమల్లు, రాములు, నరేశ్, రామకృష్ణ, దుర్గయ్య, రత్నకుమార్, ఎం.కొమరయ్య, ఎండీ యూసఫ్, ప్రసాద్, జనగామ రాజన్న పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం టీబీజీకేఎస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

రామగిరి: సింగరేణి కార్మికుల సంక్షేమం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆర్జీ–3 ఏపీఏ గనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏడాదిలో 194/240 మస్టర్లు పూర్తిచేసిన బదిలీ వర్కర్లకు పదోన్నతి, కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ స్థాయి వైద్యం, క్వార్టర్లలో ఏసీ సదుపాయం కల్పన, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.20లక్షల మ్యాచింగ్ గ్రాంట్ తదితర సంక్షేమ కార్యక్రమాలు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కిందన్నారు. యూనియన్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, నాయకులు నాగెల్లి సాంబయ్య, పర్శ బక్కయ్య, బుద్దె ఉదయ్, సంపత్ రెడ్డి, దాసరి మల్లేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి

రామగిరి: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తున్న సీఐటీయూ ఉపాధ్యక్షుడు భూపాల్, జిల్లా కార్యదర్శి ముత్యాలరావు కోరారు. శనివారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో ఫీట్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ మాత్రమే అన్నారు. గెలిపిస్తే హక్కులు సాధిస్తామంటున్న సంఘాలను నమ్మవద్దని, నిరంతరం పోరాటం చేస్తున్న సీఐటీయూను గెలిపించాలని ఆయన కోరారు. ఈ నాయకులు డి.కొమురయ్య, కుమార్, కె.వేణుగోపాల్, ప్రభాకర్, ఎస్.రాజయ్య, ఎండీ హమీద్‌పాషా, దేవేంద్రచారి, అరవింద్ పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



రాజమ్మ(ఫైల్)

కోల్‌సిటీ/కమాన్‌పూర్: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన కుందారపు రాజమ్మ(60) నేత్రాలను, కుటుంబ సభ్యులు దానం చేసి మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించారు. కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన రాజమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమ్మను జీజీహెచ్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. ఆమె నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చని వారి బంధువైన మాటేటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో, ఆమె నేత్రాలను ఆస్పత్రిలోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ బాలు సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు. నేత్రదానానికి సహకరించిన నేత్రదాత భర్త లక్ష్మయ్య, కొడుకులు, కోడలు సమ్మయ్య–పుష్ప, శ్రీనివాస్‌ను సదాశయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు నూక రమేశ్, భీష్మాచారి, చంద్రమౌళి, రాజమౌళి, వాసు, అన్నపూర్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, కార్యదర్శురాలు బంక కళావతి, మనీషా, జయప్రద అభినందించారు.

బాలికల రక్షణ కోసం 1098



అవగాహన కల్పిస్తున్న అరుణ

సుల్తానాబాద్‌రూరల్: బాలికల హక్కులు, రక్షణ కోసం హెల్ప్‌లైన్ 1098ను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారిత కోఆర్డినేటర్ అరుణ అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో శనివారం మహిళా సాధికారిత ఆధ్వర్యంలో సఖి సేవలు, విద్య, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ 1098, 181, 14567 నంబర్లను వినియోగించుకోవచ్చన్నారు. అలాగే చైల్డ్‌లైన్ సేవలు, ఉజ్వల హోమ్స్, స్వదరం హోమ్స్, బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, ప్రిన్సిపాల్ స్వప్న ఉన్నారు.